# గాంధీతాత

–నల్లబాటి రాఘవేంద్రరావు

"మృగరాజు అంటే... ఏ జంతువు?"

"సింహం."

"గుడ్, మనకు స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చింది?"

"ఆగస్టు 15, 1947."

"వెరిగుడ్, వెరిగుడ్.. కనకదుర్గ ఆలయం ఏ ఊరిలో ఉంది?"

"విజయవాడ"

"ఏమిటండీ, ఉదయాన్నే ఆ ప్రశ్నలు. బైట కాన్వెంటు కారు ఆగి ఉంది. రాజుని ఇక వదలండి. అసలు.. తూర్పున మొదలుపెట్టి, నైఋతి కెళ్ళి, ఈశాన్యానికొచ్చినట్టు... ఆ ప్రశ్నలేమిటి? ఒక పద్ధతి లేకుండా"

"సత్యా డియర్, మన రాజు చదివేది సెకండ్ క్లాస్. అయినా ఆల్‌రౌండ్ ప్రోగ్రెస్ బాగానే ఉంది. ఏమిటీ.. వాడికి 'టాటా' చెప్తూ అలా నా దగ్గరగా వచ్చేస్తున్నావ్.. అయస్కాంతంలా.. దూరం.. దూరం. నీకు మరో అబ్బాయినో, అమ్మాయినో ఇస్తేనేగాని.. చేతినిండా పని ఉండేలా లేదు."

"కృష్ణమూర్తి మహాశయా, ఏదో నెపంతో ముగ్గులోకి దింపి రంగు రంగుల ముగ్గులు పెట్టడం మీకు బాగా అలవాటు! ఒక వేళాపాళా మీకస్సలు ఉండదు. నాకు బోల్డన్ని పనులున్నాయి. వదలండి, మీరు స్నానం చేసి 'పూజ' చేసుకోండి. కాస్త పుణ్యం వస్తుందీ.. ఆ దేవి అనుగ్రహిస్తుంది."

"ఆ 'దేవి' అనుగ్రహం సులువే. ఈ సత్యాదేవి 'వరం' పొందటమే కష్టం. ఛీ.. వెధవ బ్రతుకు. సరే కాని, నీకు మరో అబ్బాయి పుట్టాక ఇద్దరితో సరిపెట్టుకొని ఆపరేషన్ చేయించేద్దామనుకుంటున్నాను. మనకిద్దరు చాలోయ్!"

"అలాగే కాని ఆపరేషన్ మీరే చేయించుకోండి. నాకు సూదిమందంటేనే చాలా భయం! మీకు ఇది వరకు కూడా చెప్పాను. డాక్టర్లన్నా.. ఆపరేషన్ అన్నా చాలా భయమని. అయినా ఇప్పుడెందుకండీ ఈ విషయాలు... త్వరగా తయారుకండి... మీకిష్టమైన జీడిపప్పు ఉప్మా తయారైంది."

❖ ❖ ❖

కొత్త సినిమా. జనం హాలు బైట గెంటుకుంటూ గోల చేస్తున్నారు టిక్కెట్ల కోసం.

దూరంగా కొబ్బరి బొండాల దుకాణాలు. మరో పక్క పాన్‌షాపులు, ఇటు రిక్షా స్టాండు. గేటుకి వారగా వేడి బఠానీవాలా, ఆ పక్కన గానుగ చెట్టు క్రింద మొక్కజొన్న పొత్తులు... ఇంకొంచెం ఇంకొంచెం దూరంగా గాంధీ గారి బొమ్మ. బాగా చిన్నది! తళతళ మెరిసిపోతుంది. చేతిలో కర్ర మరో చేతిలో పుస్తకం.. బిళ్ళ గోచీ, మెడలో జంధ్యం, బోడిగుండు, గుండ్రని అద్దాలు లేని కళ్ళజోడు.. మొలలో బొమ్మ వాచీ! ఇక్కడ ఇదివరకుండేది కాదు ఈ బొమ్మ. 'కొత్తగా పెట్టారేమో..' అని అనుకుంటుండగా ఆ బొమ్మ కదుల్తుంది' చిత్రం! అది బొమ్మ కాదు. ఒక చిన్న పిల్లవాడు. ఆరేళ్ళుంటాయి! అచ్చం గాంధీగారి చిన్న విగ్రహంలా ఆ మేకప్ ట్రెమండస్!! పాపం వంటికి అంగుళం ఖాళీ లేకుండా వైట్ సిల్వర్ పెయింట్ పాలిష్ చేసుకొని.. ఆ కుర్రాడు ఎంతో కళాత్మకంగా గాంధీగారి నిజం విగ్రహంలా నిలబడ్డాడు.. చాలా ఆశ్చర్యం! ఆ సీన్ తదేకంగా రాజు గమనిస్తుండటంతో వాడి ఆతృత చూసి దగ్గరగా తీసుకెళ్ళారు సినిమాకొచ్చిన సత్య–కృష్ణమూర్తిలు.

సడన్‌గా ఆ గాంధీ కుర్రాడు కదిలి ఆ పక్కనే ఉన్న తన తండ్రి అందించిన సత్తు బొచ్చె పట్టుకొని అందరి దగ్గరకూ వెళ్ళి డబ్బులెయ్యమని యాచిస్తున్నాడు, ప్రాధేయపడుతూ జాలిగా ఏడుస్తున్నట్టు అడుగుతున్నాడు.

"గాంధీ తాత, గాంధీ తాత.. డబ్బులెయ్యండి... దండాలు బాబూ... డబ్బులెయ్యండి" అంటూ ఆ కుర్రాడు తండ్రి కూడా అందరి కాళ్ళూ పట్టుకొని అడగటంతో ఆ చుట్టూ పోగడ్డ పెద్దవాళ్ళు, వాళ్ళ పిల్లలు నవ్వుతూ ఆ కుర్రాడు బొచ్చెలో డబ్బులు పడేస్తున్నారు. చిన్న పిల్లలు చాలా ఆనందంగా 'అడిగో గాంధీతాత' అంటూ గెంతులేస్తూ కొత్త సినిమా చూసిన దానికన్నా ఎక్కువగా ఆనందిచేస్తున్నారు. కొందరు పిల్లలు తల్లిదండ్రులతో అక్కణ్నించి వెళ్లిపోతూ... గాంధీ తాతని ఇంకాస్సేపు చూపించమని మారాం చేస్తున్నారు. మరికొందరు పిల్లలు దూరంగా వెళ్ళిపోయాక కూడా వెనక్కు తిరిగి మరీ మరీ చూస్తున్నారు. కృష్ణమూర్తి జేబులోంచి డబ్బులు తీయగానే రాజు అందుకున్నాడు.

"రాజూ, డబ్బులు కిందపడకుండా చిన్న గాంధీ గారి సత్తు బొచ్చెలో వెయ్యి."

తండ్రి మాటతో రాజు అలానే చేశాడు.. ఆనం దిస్తూ. ఆ గాంధీ కుర్రాడు తన తండ్రితో మరో సెం టరుకు వెళ్లిపోయాడు.

❖ ❖ ❖

నాలుగు రోజుల తర్వాత...

కృష్ణమూర్తి వాలు కుర్చీలో సీలింగ్‌ఫాన్ కింద కూర్చున్నాడు. దాని గాలికి తన చేతివేళ్ళ మధ్య సిగరెట్ రగుల్కుంటుంది. ఆ అగ్గి తన వేళ్ళను కాల్చబోతుంది అన్న పరిస్థితిని కూడా గమనించలేక పోతున్నాడు. గదంతా పొగ ఆవరించింది. ఆ పొగ రింగు రింగు లుగా, అలలు అలలుగా.. గంట క్రితం జరిగిన సంఘ టన జ్ఞాపకంలా...!!

"సార్.. కృష్ణమూర్తిగారూ"

"మీరా మాష్టారూ... ఇలా వచ్చారేంటి. కబురెడితే నేనే వచ్చేవాడినిగా. మీ కాన్వెంటులో మా అబ్బాయి చదువెలా ఉంది?"

"అది చెప్దామనే వచ్చాను సార్. ఈ విషయం నలుగురిలో చెప్పేది కాదు. అందుకనే ఇంటికి రావల సొచ్చింది. రెండు రోజుల క్రితం పిల్లలందరికీ యూనిట్ టెస్ట్‌లు పెట్టాం సార్."

"అరె, ఏమిటిలా బాధపడుతున్నారు. అలా కూర్చోండి... చేతిలో ఆ పేపరేంటి?"

"చెప్పలేకపోతున్నాను సార్, గుండెలోంచి తన్నుకొచ్చేస్తుంది బాధ. ఆ పరీక్షలో గాంధీగారి బాల్యం వివరించమని ఒక ప్రశ్న ఇచ్చాం సార్. దానికి మీ రాజు రాసిన ఆన్సర్.. చూడండి సార్. ఇలా చూడండీ, "గాంధీగారు అతని చిన్నప్పుడు ఊరూరా తిరిగి.. సత్తు బొచ్చె పట్టుకొని అడుక్కునేవాడు" అని రాశాడు సార్!" చేతుల్తో ముఖం కప్పేసుకుంటూ ఎక్కి ఎక్కి గట్టిగా ఏడుస్తూ చెప్పాడు ఆ వచ్చిన మాష్టారు.

కృష్ణమూర్తి చలించిపోయాడు.. మాట్లాడలేక పోయాడు.

"సార్, మాష్టారు పిల్లలకు పాఠాలు చెప్పగలరు కానీ, 25 పాళ్ళే చెప్పగలరు సార్. మిగిలిన 75 పాళ్ళూ తల్లిదండ్రుల బాధ్యతై ఉంటుందనేది నా అభిప్రాయం సార్. ఈ విషయం పెద్దవాళ్ళ దృష్టిలో పడలేదు కనుక సరిపోయింది కానీ, లేకుంటే మీ అబ్బాయి వల్ల నా ఉద్యోగం పోయి, మరో కాన్వెంటులోనూ ఉద్యోగం దొరక్క నా పెళ్ళాం బిడ్డలతో నేనూ వీధుల్లో అడుక్కుతినే పరిస్థితి వచ్చుండేది సార్! మీ అబ్బాయిలో మార్పు తీసుకురండి, లేదంటే మీ అబ్బాయి చదివే కాన్వెం టులో నేను పనిచేయలేను సార్... వస్తాను." ఆ ఆన్సర్ షీట్‌ని ముక్కలుగా చించి వెళ్ళిపోయాడు.. ఆ మాష్టారు.

తన కొడుకు రాజు మీద కృష్ణమూర్తిలో కసి పెరిగిపోయింది. సిగరెట్ తన చేతి వేళ్ళను కాల్చేస్తున్న బాధ కూడా తెలియటంలేదు.

'గాంధీ తాత, గాంధీ తాత.. మన మహాత్ముడు.. గాంధీ తాత..' అతని గుండె మెలిపెట్టిన బాధ!

పదునైన కత్తితో కొడుకు తల నరికెయ్యాలను కున్నాడు కృష్ణమూర్తి. కాని.. చాలాసేపు ఆలోచించాడు. "తప్పుచేసినవాడిది తప్పుకాదు. తప్పు చెయ్యడానికి మూలమైన ఆయా సంఘటనలదే తప్పు. విషపు విత్తనం వేశాక విషపు మొక్కే మొలుస్తుంది. భవిష్య త్తులో దాని పళ్ళూ, ఆకులూ తిని ప్రజలు చస్తారని కొమ్మలు నరికెయ్యడానికి గొడ్డలికి పదును పెట్టడం కాదు.. తెలివైనవాడి పని.. మొత్తానికి ఆ విషపు విత్తనాన్నే పెలికించి పాడేస్తే...!'

❖ ❖ ❖

తలుపు కొట్టాడు కృష్ణమూర్తి.

అతని బాబాయ్ ఎండిఒ రంగనాథం తలుపు తీశాడు. లోపలకెళ్ళి కూర్చొని జరిగిందంతా వివరంగా చెప్పాడు కృష్ణమూర్తి.

"బాబాయ్ నువ్వు మండల డెవలప్‌మెంటు ఆఫీసరువి. ఈ అనాచారం జరక్కుండా చూడు బాబాయ్..." అంటూ చేతులు పట్టుకున్నాడు.

"ఒరేయ్ కృష్ణమూర్తీ, నువ్వు చెప్పేదంతా విన్నాక ఏం చెప్పాలో అర్థం కావటంలేదురా. చిన్న విషయం గురించి ఎందుకు అంతగా ఆరాటపడుతావు?" అన్నాడు.

కృష్ణమూర్తి ఏడ్చేశాడు.. చిన్నపిల్లాడిలా.

"అలా అనకు బాబాయ్, ఇది చాలా పెద్ద విషయం. మన గాంధీతాత బాబాయ్, మన గాంధీ తాత.. ఆ బోసినవ్వుల మన గాంధీతాత.. దేవుడు కన్నా గొప్పగా భావించే మన గాంధీ తాత మన చిన్న పిల్లల మనస్సుల్లో అలా అడుక్కునేవాడుగా ముద్రించ బడడానికి వీల్లేదు" ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు కృష్ణ మూర్తి.

"నువ్వేం చేయగలవు. కొన్నాళ్ళిక్కడుండి, తర్వాత ఎక్కడికో పోయే ఆ వేషగాళ్ళని బెదిరిస్తావా. భయపెడ తావా? కొడతావా?.. ఏం చేసినా నీ మీదే కేసు పెడ తారు. అందుకని నేను చెప్పేది ప్రశాంతంగా వినరా. ఇప్పుడూ.. పెంట పోగులో, లేదా కుప్పతొట్టిలో

రాముడి బొమ్మ పడి ఉంటుంది. లేదా క్రీస్తు ఫోటో ఉండొచ్చు.. అలాగని ఆ దృశ్యం చూసినవాళ్ళు అలా చేసినవాళ్ళని పట్టుకొని శిక్షించగలరా. మనకెందుకులే అని ఎవరుమటుకు వారు చూసీ చూడనట్టు ఊరుకుం టున్నారు. అంతెందుకు ఎందరో పగటి వేషగాళ్ళు-ముష్టివాళ్ళు... ఆంజనేయుడు, శివుడు, శ్రీకృష్ణుడు లాంటి వేషాలు వేసి అడుక్కుంటున్నారు. అంతమాత్రం చేత ఆ దేవుళ్ళందరూ చరిత్రలో అడుక్కున్నట్టేనా?! ఆ దృష్టితో ఆలోచించరా. ఏ బాధా ఉండదు" రంగ నాథం అనునయంగా చెప్పాడు.

"ఆ దేవుళ్ళు వేరే బాబాయ్. ఈ 'దేవుడు' వేరే. గాంధీతాత బాబాయ్, మన గాంధీతాత.. బోసి నవ్వుల మన గాంధీ తాత.."

"ఏమిటో, నీ బాధ నాకర్థం కావటంలేదు."

"నాకు మాత్రం అంతా అర్థమయింది బాబాయ్. నువ్వేం చెప్పొద్దిక. నా ప్రయత్నం నేను చేస్తాను.

❖ ❖ ❖

నెల గడిచింది.

ఇంట్లో బాధగా కూర్చొని తదేకంగా ఆలోచిస్తున్న కృష్ణమూర్తి ఎవరిదో పొడిదగ్గు వినబడటంతో ఉలిక్కిపడ్డాడు.

ఎదురుగా తన బాబాయ్ రంగనాథం... చాలా సేపయింది వచ్చి.

"బాధపడకురా కృష్ణమూర్తీ. కలెక్టర్ గారి దగ్గరకు నువ్వెళ్ళినట్టు... ఈ దురాచాన్ని అరికట్టమని అడిగి నట్టు, ఆయన స్పందించి తప్పకుండా ఆ ప్రయత్నం చేస్తానని చెప్పినట్టు, అదే పనిమీద ఇప్పటికి 20 సార్లు నువ్వు తిరిగినా ఫలితం కనబడనట్టూ మీ ఆవిడ సత్య నాకు ఫోనుచేసి చెప్పిందిరా. ఈ విషయంలో ఎవరు మాత్రం ఏం చేస్తారు చెప్పు. నాకుండే అధికారాలూ పరిమితమే. అలా గాంధీ వేషం కట్టి అడుక్కోకండని నోటితో బెదిరించగలం. అంతేగాని శిక్షించగలమా. కూటికి లేనివాళ్ళు, వాళ్ళ మీద ఎవరు మాత్రం ప్రతా పం చూపించగలరు చెప్పు! పిచ్చుక మీద బ్రహ్మాస్త్రమే అవుతుంది కదరా.

ఏడు కొండలవాడా, వెంకటరమణా అంటూ నామాల బొట్లు పెట్టుకొని, జడలు పెంచుకొని హుండీ పట్టుకొని చాలామంది వస్తారు. వాళ్ళలో కొందరిది దొంగ నాటకమే! అలాగని వాళ్ళని మనం తిడుతు న్నామా? ఇదీ నాణానికి ఒకవైపు. మరోవైపు ఆలో చించు.. ఆ ఏడు కొండలవాడు ఆ విధంగా ఆ బికారు లను ఆదుకొని వాళ్ళ ఆకలి మంటలు తన పేరు చెప్పుకొని యాచించటం ద్వారా తీరుస్తున్నాడని.. అలా అలా.. ఆలోచించు. ఇదీ అంతేరా. దేవుడి ఉత్సవ విగ్రహాలని ఊరంతా తిప్పుతారు. ప్రజలంతా పళ్ళాతో బియ్యం ఇస్తారు. అంతమాత్రాన దేవుడు అడుక్కుంటు న్నట్టా?! అందుచేత నువ్వు సిఎం దగ్గరికెళ్ళినా.. పిఎం దగ్గరకెళ్ళినా ఫలితం ఉండదని నా అభిప్రాయం. ఎన్నో సమస్యల మీద ఎన్నో 'యాక్టు'లు పెడుతున్నారు. ఏ ఒక్కటీ చిత్తశుద్ధితో అమలు కావటంలేదు. చెయ్యలేక పోతున్నారు. అంతే.. అదే జరుగుతుంది. సో:.. నువ్వీ విషయం మరచిపోవడానికే నీ బాబాయ్‌గా ఇంత లెక్చరిచ్చాను. నువ్వు బెంగ పెట్టుకుంటున్నావని మీ ఆవిడ కబురు పెట్టడంతో వచ్చాను." కండువా సరిచేసుకుంటూ అన్నాడు.. రంగనాథం.

"వాళ్ళ చేత గాంధీ వేషం మాన్పించటం ఎలాగో ఈ కృష్ణమూర్తికి బాగా తెలుసు." కృష్ణమూర్తి రూపం కసిగా ఉండటంతో అతని బాబాయ్ రంగనాథం ఇది ఇంకా ఎక్కువగా మాట్లాడే సమయం కాదని వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

జోడు తూముల వద్ద తన కొడుకుతో అన్నం వండుకు తింటున్న లచ్చన్న ఉలిక్కిపడ్డాడు.. ఆ వ్యక్తిని చూసి.

"నీ కొడుకుతో గాంధీ వేషం కట్టకుండా ఉండా లంటే నీకెంత కావాలి?"

"పీకమీన కత్తి తీసెయ్యండయ్యా. నానేం తప్పు సెయ్యనేదు. కట్టబడి బతుకుతున్నాం."

"చెప్పు రోజుకి ఎంత సంపాదిస్తున్నావ్?"

"రంగులకీ పోను 50 రూపాయలొత్తాది"

"ఇదిగో వంద, ఈసారి గాంధీ వేషం నీ కుర్రాడి చేత వేయించకు. మరోసారి వేయించావంటే ప్రాణం తీసేస్తాను. లచ్చన్న తేరుకొని ఈ లోకంలోకి వచ్చేసరికి

## 'ఇం'ధనం

**జీ**వన యానంలో
బంధమనే వాహనానికి
ధనం ఇంధనం అయితే
అది ఎక్కడో ఓ చోట
ఎప్పుడో ఒకప్పుడు
తప్పక ఆగిపోతుంది.

**-కొప్పల పద్మావతి**

వచ్చింత వేగంగా వెళ్ళిపోయాడు హీరో హోండా మీద ఆ వ్యక్తి! అతని పేరు కృష్ణమూర్తి అని లచ్చన్నకు తెలియదు పాపం!

ఊరు చివర.. ఆ సాయంత్రం మళ్ళీ గాంధీ వేషం తన కుర్రాడికి వేయించి చెట్టు క్రింద కూర్చొని వచ్చిన డబ్బులు లెక్కపెట్టుకుంటుండగా.. మళ్ళీ వచ్చాడు ఆ వ్యక్తి! లచ్చన్న భయపడిపోయాడు. అతని కొడుకు యముడిని చూసినట్టు అచేతనంగా ఉండిపోయాడు.

"నీకు వందిచ్చానుగా. మళ్ళీ నీ కొడుకు చేత ఎందుకు వేయించావు ఈ వేషం?"

"అలవాటైపోనాది బాబూ."

"పోనీ మరేదైనా వేషం వేయించుకోరాదూ.. నీ జోలికి నేను రాను."

"ఈ ఏసమైతేనే డబ్బులొత్తున్నాయి సామీ, ఇంకే ఏసమేసినా రూపాయి దక్కదు."

"సరే నువ్వు ఈ ఊరు నుంచే వెళ్ళిపోవాలంటే...?"

"ఈడ 500 రూపాయలు అప్పుంది బాబా. సానా కట్టం."

"సరే, వెయ్యి రూపాయలు ఇవిగో. రేపు సాయంత్రం నువ్వు కనిపించకూడదు."

"అట్టాగే బాబూ, రేపు ఉదయమే కనిపించకుండా పోతాను."

"కనిపించావంటే నిజంగా చంపేస్తాను. నేను మంచోడిని కాదు. ఆఁ.. ఈ విషయం ఎవరికైనా చెప్పావంటే నీ ఆరేళ్ళ కొడుకునీ చంపేస్తాను. నేను మంచోడిని కాదని చెప్పాగా. జాగ్రత్త!"

ఆ వ్యక్తి కసిగా చూస్తూ వెళ్ళిపోయాడు

మీ పేరేమిటి అని లచ్చన్న అడగనూలేదు. నా పేరు కృష్ణమూర్తి అని చెప్పనూలేదు.

❖ ❖ ❖

"ఏమండీ, లేవండి.."

"ఏమైంది సత్యా.."

"ఆ గాంధీ కుర్రాడి తండ్రి తన కొడుకుతో మరో ఊరు వెళ్ళిపోవాలని రైలు స్టేషన్‌కెళ్తూ టాక్సీ గుద్ది చచ్చిపోయాడటండీ.." మన పాలవాడు చెప్పాడు.

"పీడ విరగడైంది. కొన్ని చావులు బాధని కలిగించవు. నువ్వు రాజుని కాన్వెంటుకి పంపేసావా? బాత్రూంలో వేడినీళ్ళు పెట్టు. నేనీరోజు ఆఫీసుకు త్వరగా వెళ్ళాలి."

సాయంత్రం... ఆఫీసు నుండి తిరిగి వస్తూ... ఆ సన్నివేశం చూసి ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి. నాలుగు రోడ్ల జంక్షన్‌లో... ఆ కుర్రాడు మళ్ళీ చిన్న గాంధీలా.. తనకు తానే వచ్చీ రానట్టు రంగులు పులుముకున్నాడు. ప్రజలంతా సానుభూతి చూపిస్తున్నారు.

"పాపం వీడి తండ్రి ఈ రోజు ఉదయమే టాక్సీ గుద్ది యాక్సిడెంటులో చచ్చిపోయాడు. ఈ కుర్రాడు ఎలా బతుకుతాడో."

"ఇప్పుడు చిన్న గాంధీ వేషం వేస్తే.. రేపు పెద్ద గాంధీ వేషం వేస్తాడు.." అన్నారెవరో.

పక్కనించి కిసుక్కున నవ్వారు మరెవరో!

"దిక్కులేని వాళ్ళకు దేవుడే దిక్కు" మరొకరన్నారు.

"బాగా చెప్పావయ్యా, కానీ, వీడికి మాత్రం ఇప్పుడు గాంధీ గారే దిక్కయ్యారు. అన్నట్టు ఆ తండ్రీ కొడుకులని ఈ ఊర్లో ఉండొద్దని... ఎవరో బెదిరిస్తున్నారట."

"వాళ్ళకదేం పొయ్యేకాలమో. నడండి.. నడండి.. మనకెందుకూ..." అనుకుంటూ ఐదు రూపాయలు వేసేవాళ్ళు పది రూపాయలు వేసి వెళ్ళిపోతున్నారు. కృష్ణమూర్తి మనసు ఆ గాంధీ కుర్రాడిని చూసి సుడిగుండంలా కాసేపు తిరిగింది.

బాధతో తనూ ఓ వంద రూపాయలు వేసి ముందుకు కదిలాడు. మళ్ళీ వెనక్కు వచ్చి...

"ఒరేయ్, ఎందుకురా నన్ను చంపుతావ్. నువ్వు ఈ వేషం వెయ్యకుండా ఉండలేవా?" అన్నాడు.

"ఇంకొకూరు పోదామని పయానమయ్యాం బాబూ, రైలు టేసనుకాడ నాన్న సచ్చిపోనాడు. నాకు అమ్మా నాన్నా లేరు. నాకు గాంధీ ఏసం ఏసుకోవటమే వచ్చయ్యా. నాకింకో ఊరూ తెలీదు. నన్నేమీ అనకండి

## నిలువరిద్దాం!

'మందు' మత్తెక్కిస్తోంది.. జాగ్రత్త!
'పొందు' మైమరపిస్తోంది ఇంకాస్త జాగ్రత్త!!
కల్తీ సిరంజులూ.. 'హెచ్ఐవి రక్తదానాలూ..
మానవాళిపై 'ఎయిడ్స్' మృత్యుద్వారాలు!
తమ్ముడూ.. ఇకనైనా జాగ్రత్త-
'ఎయిడ్స్' భారత ఖండంపై పంజా విసిరింది!
'ఎయిడ్స్'తో భరత ఖండం భగ్గుమంటోంది!
నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం.. 'ఎయిడ్స్'ను నిలువరిద్దాం!

-కుమ్మరి భిక్షపతి

బాబూ. నేను ఈడనే బతకాల. మీకాల్లట్టుకుంటా" ఆ గాంధీ కుర్రాడు కృష్ణమూర్తి కాళ్ళు గట్టిగా పట్టు కున్నాడు. పెద్దగా ఏడుస్తూ... అతనివైపు భయంతో జాలిగా చూస్తూ.

కృష్ణమూర్తి కాళ్ళు వదిలించుకొని బొచ్చెలో తనేసిన వంద రూపాయలు మళ్ళీ తీసేసుకొని పళ్ళు పటపట మని కొరుకుతూ... ఆయాసపడుతూ ఇంటికొచ్చేశాడు.

❖ ❖ ❖

"నేనోమాట చెప్తాను.. వింటారా?"

"చెప్పు"

"మన బాబు రాజు పుట్టిన రోజు రేపే. మీరూ, నేనూ ఆ గాంధీ కుర్రాడి సమస్యతో ఇలా ఉంటే బాధ పడతాడు. చూడండి రూమంతా ఎలా అలంకరించు కున్నాడో. తన ఫ్రెండ్సందరూ వస్తారట! చాలా ఆనం దంగా చెప్పాడు. రేపొక్కరోజు ఆనందంగా ఉందాం. ఏ సమస్యలూ వద్దు. వాడితో షికారుకి, గుడికి.. సాయంత్రం పార్టీ ప్రతి ఏడు లాగే చేసుకుందాం.. ఏమంటారు."

"సరే..."

తెల్లవారింది.

"సత్యా, నాకో ముఖ్యమైన పని గుర్తొచ్చింది. వెళ్ళాలి. అది చూసుకొని వచ్చేటపుడు బాబుకి మంచి గిఫ్ట్ తీసుకొస్తాను. కొంచెం ఆలస్యం అవ్వొచ్చు. వచ్చాకే కేక్ కట్ చేయిద్దాం. నువ్వన్నీ రెడీ చేసి ఉంచు."

"ఎన్ని పనులున్నా ఈ రోజు ఆపేవారుగా."

"నిజమే, ఇది అలా ఆపాలన్నా ఆగే విషయం కాదు. పైగా బాబుకి గిఫ్ట్ కూడా మరిచాను కదా. అదైనా తేవాలిగా. నే వస్తాను.. గేటు దాటి నడుస్తున్నాడు కృష్ణమూర్తి."

"అదేమిటి.. బండి మీద వెళ్ళరే..." వెనుక నుండి అడిగింది సత్య.

"ఈ రోజు ఆటోమీద వెళ్ళాలనుందోయ్"

అలా వెళ్ళిన కృష్ణమూర్తి మధ్యాహ్నం 2 గంటలు దాకాట ఆటో మీద ఇంటికొచ్చాడు. చాలా నీరసంతో. ఆటోలోంచి బాధతో దిగుతున్న అతన్ని చూసి భయపడి పోయారు సత్య, రాజులు.

"అదేమిటీ, అలా క్రిందకు దిగలేకపోతున్నారు. ఏమైదండీ, ఆ నీరసం ఏమిటీ.. వల్లంతా చెమటలు.. మీకేదో అయ్యింది. ఈ అబ్బాయెవరు? మన రాజు ఫ్రండు కాదే."

"లోపలకు నడు..." భార్య కొడుకు మీద చేతులు ఆన్చి లోపలకొచ్చాడు కృష్ణమూర్తి. సత్తువ లేనట్టుగా.. నెమ్మదిగా.

బర్త్‌డే హాలు వైభవంగా అలంకరింపబడి ఉంది.

"సత్యా, నేను 'వేసక్టమీ' చేయించుకున్నాను. నీకు ఆపరేషన్ అంటే భయమన్నావుగా"

"నిజమా, అలా గదిలోకొచ్చి పడుకోండి."

"కంగారు పడకు. నాకు ప్రశాంతంగానే ఉంది. ఇలా కూర్చుంటాను. మనకు ఇద్దరు బిడ్డలు లేకుండా ఇదేమిటి? అనుకుంటున్నావు కదూ. నా మాట మీద గౌరవం ఉంచుతావనే ఈ నిర్ణయం తీసుకున్నాను. మన రెండో అబ్బాయెవరో తెలుసా..? అదిగో ఆ గుమ్మం దగ్గర నిలబడిపోయాడే.. ఆ గాంధీ కుర్రాడే. బాబూ రాజా, వెళ్ళి నీ తమ్ముడిని తీసుకొన్ని 'కేక్' కట్ చెయ్యరా. నీకు నేనిచ్చే గొప్ప బర్త్‌డే బహుమతి.. నీ తమ్ముడేరా!"... "సత్యా, నీకు ఆపరేషన్ చేయించ కుండా నేనే చేయించుకున్నాను. పైగా పురిటినొప్పుల బాధ లేకుండా రెండో బిడ్డను కూడా ఇచ్చాను.. 'ఇది'.. నీకూ 'గిఫ్ట్' ఇచ్చినట్టే!.. మరెందుకు బాధపడు తున్నావు?"

"ఇది బాధ కాదండీ, ఆనందం! గొప్ప మనసున్న భర్తకి భార్యగా బ్రతకటం ఆనందంగా ఉంది."

"చట్ట ప్రకారం కాదు, మన మనస్సాక్షి ప్రకారం ఈ క్షణం నుండి వాడు మనకు.. ఆ మహాత్ముడు ఇచ్చిన రెండో సంతానం. పెద్దవాడి పేరు.. 'రాజు'. మరి ఈ చిన్నబ్బాయి పేరు నువ్వు చెప్పు సత్యా.."

"గాంధీ..."

"బాగుంది. 'గాంధీ' మంచి పేరు పెట్టావు. నా మనసు అర్థం చేసుకునే భార్య దొరికినందుకు నాకూ సంతోషంగానే ఉంది'' ఆనందంతో భార్యను కౌగలించుకోబోయి ఆగిపోయాడు కృష్ణమూర్తి.

దూరంగా.. 'రాజు' కేక్ 'కట్' చేశాడు. 'గాంధీ' ఒక ముక్కతీసి తనఅన్న 'రాజు' నోట్లో పెట్టాడు. 'రాజు' మరో ముక్కతీసి తన తమ్ముడు 'గాంధీ' నోట్లో పెట్టాడు!!

వాళ్ళిద్దరూ ప్రేమగా కౌగలించుకుంటున్నారు. చుట్టూ కట్టిన బుడగలు పేల్చుతూ, ఆటలాడుకుంటూ.. కిలకిలా నవ్వుకుంటున్నారు.

ఆ శుభ సమయాన ఆ దృశ్యం చూసిన సత్యా కృష్ణమూర్తులు పరమానందంతో ఉప్పొంగిపోయారు గలగల పారే గోదారి కెరటాల్లా!

గోడ మీద కేలండర్‌లో బోసినవ్వుల గాంధీ తాత ముఖం కళకళలాడిపోతుంది. ■